ప్రజాశక్తి
శనివారం 7 డిసెంబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు

కించుమండలో సమగ్ర సర్వే

ప్రజాశక్తి- డుంబ్రిగుడ:గిరిజన కుటుంబాల సమగ్ర సమాచారాన్ని రైజ్ ట్రైబ్ యాప్ తో సమగ్ర సర్వే చేసి ఆదాయం పెంపుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని రాష్ట్ర టీడబ్ల్యుడీ ప్రోగ్రాం మేనేజర్ హరేరామ్ అన్నారు. మండలంలోని కించుమండ పంచాయతీ కేంద్రంలో గిరిజన కుటుంబాల సమగ్ర సమాచారాన్ని శుక్రవారం సేకరించారు. ఇంటింటికెళ్లి అధికారులతో సర్వేను నిర్వహించారు. అల్లూరి జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ గ్రామాలుగా కించుమండ, పేదలబుడు గ్రామాల్లో ఎంపిక చేయడం జరిగిందన్నారు. రైజ్ ట్రైబ్ యాప్ ప్రత్యేక వివరాలను సేకరించి గిరిజన కుటుంబాలకు సంక్షేమ పథకాలు, ఆదాయం పెంపుతోపాటు అభివృద్ధికి తోడ్పాటును అందించేందుకు వీలుంటుందన్నారు. ఎంపీడీఓ ప్రేమ్ సాగర్, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సర్వేను పరిశీలిస్తున్న మేనేజర్

డిఆర్ డిపోలను పునరుద్ధరిస్తాం

- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి -పాడేరు: ఏజెన్సీలో డిఆర్‌డిపోలను పునరుద్ధరించి మెరుగైన రేషన్ సరఫరాకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. శుక్రవారం ఆయన పాడేరు నియోజకవర్గంలో పర్యటించారు ముందుగా ఆయన మోదపల్లి జంక్షన్‌లో మోదకొండ అమ్మవారి పాదాలను దర్శించుకున్నారు. అక్కడ నుంచి మినుములూరు చేరుకున్నారు ఈ గ్రామంలో గిరిజన మహిళలు మంత్రిని సంప్రదాయ పద్ధతిలో ఆహ్వానించారు. గిరిజన సంప్రదాయ చిహ్నాలతో, పాటలతో ఆయనకు స్వాగతం పలికారు. గ్రామంలోని గిరిజన మహిళలతో మంత్రి నేరుగా ముఖాముఖీ మాట్లాడారు. వారి సమస్యలు, అవసరాలు గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై చర్చించారు.మంత్రికి మహిళలు తమ గ్రామ సమస్యలను వివరించగా, వాటిని తక్షణం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో తాగునీటి సమస్య ప్రధానంగా కనిపిస్తోందని, జల జీవన్ మిషన్ పనులకు నిధులు మంజూరు కాలేదని సర్పంచ్ చెబుతున్నారని ఈ సమస్యపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు.గతంలో డిఆర్ డిపోలకు జీసీసీ ద్వారా బాగా రేషన్ సరఫరా జరిగేదన్నారు. రేషన్ డిపోల పెట్టి అవసరమైన సరుకులన్నీ అందించే ఏర్పాటు చేస్తామన్నారు. ఏజెన్సీలో ఎన్నో వనరులు ఉన్నాయని, వాటి ఆధారంగా యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం ఆయన పాడేరు లోని జనసేన కార్యాలయాన్ని సందర్శించారు. పార్టీ శ్రేణులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జనసేన నియోజకవర్గ నాయకులు వంపురు గంగులయ్య, జీసీసీ డైరెక్టర్ బుర్ర నాగరాజు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గిరిజన మహిళలతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

హుకుంపేట:-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు తాడిపుట్టు పంచాయతీ సమస్యలను విన్నవించినట్లు సర్పంచ్ సోమెలి సత్యవతి శుక్రవారం పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ సమస్యలు, జాతీయ రహదారి నుండి గడుగుపల్లి గ్రామంలో ఇరు వైపులా మురుగు కాలువలు 1.5 మీటర్లు, 3.మీటర్ల రోడ్డుకు ఇరువైపులా చీకటి ఉండటం వలన తరచూగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని. సుమారు 15 మంది రోడ్డ ప్రమాదంలో దుర్మరణం చెందారన్నారు.రోడ్డుకు ఇరువైపులా వీది దీపాలు, గడుగుపల్లిలో కమ్యూనిటీ హాల్, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సోమెలి అబ్బయ్య, వంతాల సూర్యనారాయణ, అప్పలకొండ, పాంగి సన్యాసి రావు, సమరెడ్డి సింహాచలం, కిముడు ఆనంద్, మత్తె రమణ గోకుల్, తదితర నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూనియన్ నేతలు

తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోండి

ప్రజాశక్తి-పాడేరు : తొలగించబడిన హెల్త్ అసిస్టెంట్లను విధులలోకి తీసుకోవాలని, గిరిజన ప్రాంత వైద్యారోగ్య ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శెట్టి నాగరాజు ఉపాధ్యక్షుడు కంబిడి లక్ష్మణరావు, సిఐటియు మండల కార్యదర్శి సుందర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పాడేరు సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం డి - మెరిట్ ఉద్యోగులు అని సాకు చూపి తొలగించిన 36 మంది హెల్త్ అసిస్టెంట్లను మానవతా దృక్పథంతో విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. 2002 సంవత్సరంలో కాంట్రాక్టు బేసిక్‌లో హెల్త్ అసిస్టెంట్లుగా నియమితులై 20 సంవత్సరాలుగా క్షేత్రస్థాయిలో ప్రజానీకానికి వైద్య ఆరోగ్య సేవలు అందించిన మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లను కోర్టు ఉత్తర్వుల ద్వారా ప్రభుత్వం తొలగించడం అన్యాయమన్నారు. బహుముఖంగా గిరిజన ప్రాంతంలో ప్రబలే ప్రాణాంతకమైన మలేరియా డయేరియా టైఫాయిడ్ ఆంత్రాక్స్, కలరా వంటి వ్యాధులను ఎదుర్కోవడంలో ఎంతో ధైర్యంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలు అందించారన్నారు.ఉద్యోగులను తొలగించడంతో గిరిజన ప్రాంతంలో మలేరియా, డయేరియా, టైఫాయిడ్ వంటి ప్రాణాంతక వ్యాధులు నివారణకు తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉందని వారి సేవలు గిరిజన ప్రాంతంలో ఎంతో అవసరమన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని గిరిజన ప్రాంత వైద్య ఉద్యోగుల సంఘం యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) తరఫున కోరారు.

పాఠశాలకు తాగునీరు పునరుద్ధరణ

'ప్రజాశక్తి' కథనానికి సర్పంచ్ స్పందన

పైపులైన్ బాగుచేయిస్తున్న సర్పంచ్

పాఠశాల కుళాయికి వస్తున్న నీరు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ శివారునున్న ఎంపిపి పాఠశాలకు శుక్రవారం తాగునీటిని స్థానిక సర్పంచ్ పాంగి దుర్జో చొరవతో పునరుద్ధరించారు. పాఠశాలలోని బోరు పాడవ్వడంతోపాటు, కుళాయిల పైపులైన్లు పాడై తాగునీరు సరఫరా లేని పక్షంలో మధ్యాహ్న భోజన వంటలకు వంట ఏజెన్సీతోపాటు విద్యార్థులు పడుతున్న అవస్థలపై శుక్రవారం ప్రజాశక్తిలో 'పాడైన బోరు.. మూలకు చేరిన కుళాయి' శీర్షికతో వెలువడిన కథనానికి స్థానిక సర్పంచ్ పాంగి. దుర్జో స్పందించారు. మంచినీటి కుళాయి పైపు లైన్‌కు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి తాగునీటి పునరుద్ధరణ చేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ దుర్జో మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ పనుల్లో భాగంగా పాఠశాలకు గ్రామానికి వాటర్ ట్యాంక్ నుంచి పైపులైన్లు ఏర్పాటు చేశారని, వాటి ద్వారా నీటి సరఫరా జరిగేటప్పుడు కొన్ని సాంకేతికపరమైన సమస్యలు ఏర్పడ్డాయన్నారు. ప్రస్తుతం పాఠశాలకు వెళ్లే పైపులైన్‌ను తాత్కాలికంగా బాగుచేసి నీటి పునరుద్ధరణ చేశామన్నారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు సమాచారం అందించి, పూర్తిస్థాయి మరమ్మతులు చేసి, చింతపల్లి క్యాంపు గ్రామానికి, పాఠశాలకు పూర్తిస్థాయిలో మంచినీటి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పది వేల కోట్ల రూపాయలు కేటాయించాలని సిపిఎం జిల్లా ప్రధమ మహాసభ తీర్మానం చేసిందని, ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స వెల్లడించారు. ఈనెల 4న బహిరంగ సభ, 5న ప్రతినిధుల సభ దిగ్విజయమైందన్నారు. ఈ సందర్భంగా పాడేరు సిపిఎం కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎల్.సుందరరావు, పి. లక్కు, వంతాల దాస్‌తో కలిసి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స విలేకర్ల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా పరిపాలన, అభివృద్ధి, సంక్షేమం, గిరిజన హక్కులు, చట్టాల అమలుపై జిల్లా పరిషత్ సమావేశం పాడేరు కేంద్రంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నూతనంగా ఏర్పడి సుమారు 3 సంవత్సరాలైనా నేటికి ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కడున్నాయో.ప్రజలకు తెలియని పరిస్థితి ఉందన్నారు. జిల్లా పరిపాలన వ్యవస్థ బలోపేతానికి ప్రత్యేకమైన చర్యలు ప్రభుత్వం చేపట్టాలన్నారు. మారుమూల ఆదివాసీ గ్రామాల్లో నేటికి కనిపిస్తున్న డోలీమోతల నివారణకు రహదారి, రవాణా, కమ్యూనికేషన్ వ్యవస్థలు మెరుగు పరచాలని అన్నారు. స్థానిక ఆదివాసీ యువతకు చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి కల్పించాలని, జి.ఓ 3 రద్దుకావడంతో నిరుద్యోగుల తీవ్రంగా పెరిగిందని, షెడ్యూల్డ్ ఏరియా స్థానిక ఆదివాసీ ఉద్యోగ రిజర్వేషన్ కల్పించాలని, ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్‌న్ జారీ చేయాలని, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అదివాసీ మాతృభాష వలంటీర్లకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.పివిటిజీ గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, అర్హులైన ఆదివాసీలకు రూ.5లక్షలతో ఇళ్లు నిర్మించాలని, పీసా కమిటీ, అటవీ హక్కుల కమిటీలకు ఎన్నికలు నిర్వహించి ఆదివాసీ గ్రామసభలకు అధికారం కల్పించాలన్నారు. అనంతగిరి నాన్ షెడ్యూల్డ్ ఏరియాను 5వ షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలని, ఆదివాసీ చట్టాలకు వ్యతిరేకంగా అనుమతించిన హైడ్రో పవర్ ప్రాజెక్టు రద్దు చేయాలన్నారు. అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి సంతల్లో మోసాలు అరికట్టాలని, 1/70చట్టాన్ని పకడ్బందిగా అమలుచేసి ఎన్టీఆర్ కేసులు నమోదు చేయాలన్నారు. 200 రోజులు ఉపాధి హామీ పనులు కల్పించాలని, కార్మికులకుకనీస వేతనం కల్పించి రెగ్యులర్ చేయాలని, పోలవరం నిర్వాసితులకు పునరావాసం, పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ ఉపాధి హామీ పథకాన్ని

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

అనుసంధానం చేయాలని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం జాతీయ రహదారి బాధితులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు.అరకు, చింతపల్లి, ముంచంగిపుట్టు ఆసుపత్రులను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులగా అభివృద్ధి చేయాలన్నారు. పాడేరు జనరల్ ఆసుపత్రిని కనీస సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.

వేతన బకాయి చెల్లించకుంటే సమ్మె

17 మందికి 18నెలలుగా అందని జీతాలు

విధులు బహిష్కరించి ఆందోళనలో వెలుగు విఓఎలు

ఐటిడిఎ ఎపిఒకు వినతిపత్రం ఇస్తున్న విఒఎలు

ప్రజాశక్తి- రంపచోడవరం : తమకు బకాయి పడ్డ 18నెలల వేతన బకాయి చెల్లించి, ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే సమ్మె బాట తప్పదని వెలుగు విఓఎలు హెచ్చరించారు. ఈ మేరకు మూడు మండలాల పరిధిలోని 17మంది వెలుగు యానిమేటర్స్ ఈనెల 3న ఎపిఎంకు మెమోరాండం అందజేసి ఆందోళనలో పాల్గొంటున్నారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి అరగాటి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, రంపచోడవరంలో 9 మంది, దేవిపట్నం ఏడుగురు, గంగవరంలో ఒకరు మొత్తంగా 17 మందికి 2023 జూన్ నుంచి 2024 నవంబర్ నేటివరకు 18,నెలల వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గత నెల 20న ఐటిడిఎ ప్రాజెక్టు అధికారికి రాతపూర్వకంగా విన్నవించగా, విజయవాడ సేర్ఫ్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని, అయినా ఎటువంటి ఫలితం లేదన్నారు. విఒఎల వేతన బకాయి విషయం మరిచిపోవడం మంచిదని సంబంధిత విభాగం ఉద్యోగి ఒకరు అనడంపై వారంతా ఆవేదన చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి తమకు వేతన బకాయి చెల్లించకుంటే రెండు డివిజన్ల పరిధిలోని విఒఎలను సమీకరించి, నిరవధిక సమ్మెకు వెళతామని హెచ్చరించారు.

పని ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సిఐటియు నేత చిన్నయ్యపడాల్

పని దినాలు పెంచాలి

ప్రజాశక్తి- చింతపల్లి :ఉపాధి హామీ పనులు రెండు వందల రోజులు పెంచాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. చింతపల్లి మండలం తాజంకి పంచాయతీ వంతమామిడి గ్రామంలో ఉపాధి పనులు పరిశీలించారు. అనంతరం ఆనయ మాట్లాడుతూ, కమ్యూనిస్టుల పోరాటంతో ఉపాధి హామీ చట్టం వచ్చిందని వేలాది మంది ఉపాధి కూలీలకు వంద రోజులు పని గ్యారంటీ చేస్తూ చట్టబద్ధత కల్పించిందని అన్నారు. పని ప్రదేశంలో టెంటు, మంచినీళ్ల సదుపాయం కల్పించాల్సి కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. ఉపాధిహామీ చట్టంలో పనిచేసిన 15 రోజులకే కూలీల డబ్బులు ఇవ్వాలని నిబంధన ఉన్నా ఈ ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత కూలీల పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ త్రినాథ్

చట్టాల అమల్లో విఫలం

ప్రజాశక్తి -ముంచింగి పుట్టు:మండలంలోని అతి మారుమూల ప్రాంతమైన లక్ష్మీపురం గ్రామపంచాయతీ కేంద్రంలో సిపిఎం సర్పంచి కొర్ర త్రినాథ్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామ సభను శుక్రవారం సచివాలయ కార్యాలయంలో నిర్వహించారు. అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సర్పంచి కొర్రా. త్రినాథ్ మాట్లాడుతూ ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ప్రత్యేక హక్కులు, చట్టాలు ఉన్నప్పటికీ నేటికీ వాటిని అమల్లోకి తేకపోవడం దుర్మార్గమన్నారు. 1/70 చట్టం, పిసా చట్టం గిరిజన ప్రాంతంలో సక్రమంగా అమలు చేయడంలో ప్రభుత్వ అధికారులు వైఫల్యం చెందుతున్నారన్నారు. బడుగు బలహీన వర్గాల కొరకు రాజ్యాంగంలో రూపొందించిన ప్రత్యేక హక్కులు చట్టాలను కాలరాస్తున్నారన్నారు. గ్రామాల్లో రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం అయితే రవాణా కష్టాలు ఆదివాసి గిరిజనులకు తీరుతుందన్నారు. రోడ్డు పనులు చేపట్టే గుత్తేదారులకు గ్రామస్థులు అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వి.సద్దురామ్, ఉప సర్పంచ్ అర్లబు సత్యం, మాజీ ఉప సర్పంచ్ వి ధనుర్జయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ టీచర్లపై నిర్లక్ష్యం తగదు

- **సమ్మె చేస్తున్నా స్పందించకపోవడం దుర్మార్గం**
- **సిపిఎం మండల కార్యదర్శి వెంకట్**

సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

పజాశక్తి-చింతూరు: రాష్ట్రవ్యాప్తంగా గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని సిపిఎం మండల కమిటీ కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. 20 రోజులుగా వారు సమ్మె చేస్తుండడంతో గిరిజన బాలల చదువులు అటకెక్కే పరిస్థితి దాపురించినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు.

శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో సమావేశంలో పల్లపు వెంకట్ మాట్లాడుతూ ఎర్రంపేట, కోతులగుట్ట గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలల్లో నాలుగు మండలాల గిరిజన విద్యార్థుల చదువును అభ్యసిస్తున్నారన్నారు. ఆయా విద్యాసంస్థల్లో ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ మినహాయించి మిగతా అందరూ అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు 15ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. తమకు వేతనాలతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మూడువారాలుగా వారు సమ్మెకు వెళ్లడంతో పాఠశాలల్లో తరగతులు జరగడం లేదన్నారు. ముఖ్యంగా. పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల సిలబస్‌లు పూర్తికాని పరిస్థితుల్లో వారికి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తుండడంతో నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. ఒక పక్క గురుకుల విద్యాసంస్థల్లో టీచర్లు లేక విద్యార్థులు చదువుకు దూరం అవుతుంటే మెగా పేరెంట్స్ మీటింగ్ పెట్టి ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. సమ్మెలో ఉన్నవారి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారికిషోకాజ్ నోటీసులతో భయాందోళనలకు గురిచేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ టీచింగ్ సిబ్బందిని కాంట్రాక్ట్ వ్యవస్థలోకి మార్చి మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించి, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం నేతలు సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాస్, పోడియం లక్ష్మణ్, పట్రా రమేష్, బీరబోయిన దిలీప్, కారం సుబ్బారావు పాల్గొన్నారు.

సీలేరు: సమ్మెలో ఉన్న గురుకులాల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీలేరు సర్పంచ్ పాంగి దుర్జో డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన గురుకులంలో 21 మంది ఉపాధ్యాయులుండగా వారిలో కేవలం ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ఉపాధ్యాయులన్నారు. 19 మంది అవుట్సోర్సింగ్ ఉపాధ్యాయులు 20రోజులుగా సమ్మెలో ఉంటే 380 మంది విద్యార్థులకు చదువు చెప్పే వారెవరని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి గురుకులాల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి, గిరిబాలల చదువుకు భరోసాగా ఉండాలని కోరారు.



సీలేరులో ఉపాధ్యాయులు లేక చదువులు సాగని తరగతి గది

సమస్యలపై మంత్రి మనోహర్‌కు వినతి

ప్రజాశక్తి -సీలేరు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా పాడేరు విచ్చేసిన రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఘన స్వాగతం లభించింది. జనసేన పార్టీ పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు గొర్లె వీర వెంకట్, జీకే వీధి మండల నాయకులు గుండ్ల రఘువంశీ, మండల ఉపాధ్యక్షులు సిద్ధార్థ మార్క్ ఆధ్వర్యంలో మంత్రి మనోహర్‌ను కలిసి, మండలంలో ఉన్న సమస్యలు విన్నవించి, పరిష్కరించాలని కోరారు. దీనిపై మంత్రి నాదెండ్ల మనోహర్ సానుకూలంగా స్పందించారనితెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు కొయ్యము. ఇమ్మాన్యుయేల్ (సిద్దు) బడుతూరు పరమేశ, వనపల. ఈశ్వరరావు, మధు, కొర్ర. రాజు, పాంగి. చంటి, గెమ్మెల. రాజు పాల్గొన్నారు.

మంత్రిని స్వాగతిస్తున్న జనసేన నేతలు

డిజిటల్ సేవా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -మారేడుమిల్లి : మండల కేంద్రంలో టిడిపి రాబిన్ శర్మ టీం సభ్యులైన కె. రాజేష్ ఏర్పాటు చేసిన రాజేష్ డిజిటల్ సేవా కామన్ సర్వీస్ పాయింట్ కేంద్రాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షులు మఠం విజయభాస్కర్ శుక్రవారం ప్రారంభించారు.కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పి రాజ్‌కుమార్ రెడ్డి, బి.అప్పాజీ, సన్యాసిరెడ్డి, జార్జ్ బాబు, ప్రణీత్, శివ, సత్య పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి దంపతులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ రాజు.

ప్రజాశక్తి -సీలేరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని దారకొండ సర్పంచ్ నడిగట్ల. రాజు పిలుపునిచ్చారు.శుక్రవారం దారకొండ సచివాలయంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సులో మాట్లాడుతూ బాల్య వివాహాల అనర్థాలను వివరించారు. బాల్యంలోనే పెళ్లిళ్లు చేస్తే కాన్పు సమయంలో ప్రాణాపాయంతో పాటు అనారోగ్యాన్ని గురికావడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సన్మార్గం వైపు నడవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పుట్టపల్లి. కాసులమ్మ, మహిళా పోలీసు, అంగన్వాడి సిబ్బంది, ఆశా వర్కర్లు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

నేడు మెగా పేరెంట్స్ సమావేశం

విజయవంతం చేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-మారేడుమిల్లి: ఈనెల 7న జరగనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో 'మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో' ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివద్ధికి, విద్యా ప్రమాణాల స్థాయి మెరుగుపరిచి నాణ్యమైన విద్య అందించేందుకు తీసుకోవలసిన అవసరమైన చర్యలను విద్యార్థుల తలిదండ్రులు, ఉపాధ్యాయులు చర్చించుకోడానికి 'మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం' సరైన వేదికన్నారు. విద్యా హక్కు చట్టం, జాతీయ విద్యా విధానంలో ప్రభుత్వ పాఠశాల ద్వారా నాణ్యమైన విద్యా అందించేందుకు విద్యా ప్రమాణాల స్థాయి పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చర్యలు తీసుకుంటున్నాయన్నారు.

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం ఆదేశాల మేరకు మండలంలో ఉన్న అన్ని ప్రాథమిక, ఉన్నత, రెసిడెన్షియల్, గిరిజన ప్రభుత్వ పాఠశాలల్లో సమావేశాలు ప్రారంభమవుతాయన్నారు. ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనలపై చర్చిస్తారన్నారు. అనంతరం అందరూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంలో సహపంక్తి భోజనం చేస్తారన్నారు. ఇప్పటికే అందరికీ ఆహ్వానాలు పంపారని, పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియామవాళి అమలులో ఉన్నందున ఎటువంటి రాజకీయ ప్రమేయం ఉండకూడదని ఎంపిడిఒ స్పష్టం చేశారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

హుకుంపేటలో నివాళులర్పిస్తున్న కళాశాల సిబ్బంది

ప్రజాశక్తి-యంత్రాంగం

హుకుంపేట: మండల కేంద్రంలోని కళాశాలలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి వేడుకలు సందర్భంగా ఆదివాసి గిరిజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి హైమావతి, హుకుంపేట మండల వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, గిరిజన సంఘం జిల్లా నాయకులు టి కృష్ణారావు, కొంతిలి వైస్ సర్పంచ్ కృష్ణమూర్తి, జూనియర్ కాలేజ్ వార్డెన్ కన్యాకుమారిలు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.

జిమాడుగుల: మండల కేంద్రంలో సచివాలయంలో శుక్రవారం అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని స్థానిక సర్పంచ్ రాంబాబు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రవిశాస్త్రి, వెల్ఫేర్ అసిస్టెంట్ తరుణ్ కుమార్, మహిళ పోలీసు ఉష్యశ్రీ, డిజిటల్ అసిస్టెంట్ చిన్నతల్లి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకట్, మూర్తి, హేమంత్ పాల్గొన్నారు.

పెదబయలు : మండల కేంద్రంలో అంబేద్కర్ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షులు సిహెచ్ బీమసుందర్‌రావు ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు సిపిఎం మండల కార్యదర్శి బోండా సన్నిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతపల్లి : అంబేద్కర్ 68వ వర్ధంతిని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలిటెక్నిక్ ఆర్గానిక్ ఫార్మింగ్ వద్ద పరిశోధనా స్థానం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ బయ్యపు రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి బాల హుస్సేన్ రెడ్డి, శాస్త్రవేత్తలు బి.ఎన్ సందీప్ నాయక్, జోగారావు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు : మండలంలోని కించాయిపుట్టు పంచాయితీ కించాయిపుట్టు గ్రామంలో స్థానిక అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో గ్రామ ఉద్యోగి రొబ్బ చంద్రశేఖర్ అధ్యక్షతన శుక్రవారం అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని విశ్రాంత ఉద్యోగి చిట్టపులి ప్రసాదరావు, ఉపాధ్యాయుడు రొబ్బ చంద్రశేఖర్‌లు అన్నారు. ఈ కార్యక్రమంలో భాష వాలంటర్ ఎస్.రమేష్, సిహెచ్ సాంబమూర్తి, నాగభూషణం పాల్గొన్నారు.

చింతూరు : అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని సిపిఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్ అన్నారు. శుక్రవారం అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. సిపిఎం నేతలు సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పొడియం లక్ష్మణ్, జానీ పాల్గొన్నారు.

కూనవరం : స్థానిక సిపిఎం కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషిని కొనియాడారు.కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, గడ్డిపాటి షణ్ముఖరావు, నోముల సత్యనారాయణ, కర్నాటి శ్రీనివాసరావు, ధన్నూరి శ్రీనివాసరావు,కొండా ఈశ్వర్లు, సుధారాణి పాల్గొన్నారు

సీలేరు: సీలేరులో అంబేద్కర్ 68వ వర్ధంతిని పురస్కరించుకుని పోస్టాఫీస్ సమీపంలో అంబేద్కర్ విగ్రహానికి ఎపి జెన్‌కో ఇఇ రాజేంద్రప్రసాద్, ఎడిఇ క్యాంపు దుర్గా శ్రీనివాస్, పంపు స్టోరేజ్ ఎఇ సిహెచ్.సురేష్, 1104 యూనియన్ రీజనల్ సెక్రెటరీ సత్తిబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సబ్ ఇంజనీర్ శ్రీధర్, ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ నాయకులు, ఎపి జెన్‌కో ఇంజినీర్లు,, ఉద్యోగులు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.
డిఎవి పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి హెచ్‌ఎం ఎన్.కిరణ్‌కుమార్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంబేద్కర్ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు.

రంపచోడవరం : స్థానిక అంబేద్కర్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు జయరాజు, కూటమి నాయకులు పి మోహన్, ఎం బాపిరాజు, పి. శ్రీనివాసరావు, ఎస్ బాపిరాజు, వై నిరంజనీదేవి, గణపతి, డి జనార్ధన్, మైనారిటీ విభాగ నాయకులు షేక్ ఇబ్రహీం, చక్రపాణి, ఎస్ సత్యవతి, సింహాద్రి, ఎస్ వెంకన్న, టి సతీష్ వర్మ, పి.అబ్బులు, కొండబాబు, కన్నారం నాగు, పి.బాబి, సింహాచలం, కె.బాపన్న దొర పాల్గొన్నారు.

దేవీపట్నం : మండలంలోని కొండమొదలు పంచాయతీ ఆర్అండ్ఆర్ కాలనీ, పెద్దభీంపల్లి ఎంపిపి పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి మండల న్యాయ సేవాధికార సంస్థ పారా లీగల్ వాలంటీర్, ఆదివాసీ జెఎసి రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో కారం రామన్న దొర, యలగాడ నాగేశ్వరరావు, కుండ్ల సాయిరామ్ రెడ్డి, నడిపూడి గణపతి రెడ్డి, నడిపూడి భానుశంకర్ రెడ్డి, హెచ్‌ఎం కుంజం చిన్నబ్బాయి దొర, కారం బుజ్జిబాబు దొర, పిఎ.స్వామి, ఎస్‌ఎంసి చైర్మన్ నడిపూడి లక్ష్మిగంగా భవాని పాల్గొన్నారు.

రంపచోడవరంలో పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని గూడలో ఫెలోషిప్ ఐక్య క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక గీతాలను ఆలపించారు. ఆరు మండలాల నుంచి భారీగా దైవ సేవకులు తరలివచ్చారు. ఏసుక్రీస్తు జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కటింగ్ చేసి కొవ్వొత్తులను వెలిగించారు. సభాధ్యక్షులు ఫెలోషిప్ కార్యదర్శి కె.వి సుధాకర్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. దైవ వర్తమానికులు అంజూరీ ఫిలిప్ తిమోతి మాట్లాడుతూ, ఏసుక్రీస్తును హృదయాలలోకి ఆహ్వానించడయే నిజమైన క్రిస్మస్ అని దైవ సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ అధ్యక్షులు కొర్ర ప్రేమ్ కుమార్, అరుకు నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు జేమ్స్ మోజెష్ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని అరకులోయ డుంబ్రిగూడ సరిహద్దు బురద గెడ్డ వంతెన వద్ద మరమ్మతుకు గురైన రోడ్డును వెంటనే పనులు చేపట్టాలని స్థానిక అల్లూరి యూత్ మండల అధ్యక్షుడు కే.సూర్య ప్రకాష్ డిమాండ్ చేశారు. శుక్రవారం అయిన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వంతెన వద్ద రోడ్డు కోతకు గురై సుమారు 6 మాసాలు గడుస్తున్నా ఇప్పటికీ మరమ్మతు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తుండడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -చింతపల్లి: సిమెంటు రహదారులను సద్వినియోగం చేసుకోవాలని చౌడుపల్లి సర్పంచ్ గెమ్మేల లలిత కోరారు. పంచాయతీ పరిధిలోని కొత్త వీధి గ్రామంలో నాలుగు లక్షల రూపాయల పంచాయతీ నిధులతో 100 మీటర్ల సిమెంటు రహదారి నిర్మాణానికి సచివాలయ సిబ్బంది, ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరి గ్రామాలలో అధ్వాన్నంగా ఉన్న రహదారులను సిమెంటు రహదారులుగా నిర్మించేందుకు పంచాయతీ ద్వారా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకుడు సింహాచలం, పంచాయతీ వార్డు సభ్యుడు కరుణానిధి, ఎన్డీఏ కూటమి నాయకులు మంగు, మధు, ప్రసాదు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోరు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - చింతపల్లి :- తాగునీటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య కోరారు. కొమ్మంగి పంచాయతీ రవ్ రింతాడ రోడ్డు వీధిలో జిల్లా పరిషత్తు నిధులతో మంచినీటి బోరు నిర్మాణానికి శుక్రవారం ఆ పంచాయతీ సర్పంచ్ పాంగి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు జర్త రూతులతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో మంచినీటి ఎద్దడి చాలా ఎక్కువగా ఉందని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకువెళ్లగా ఆమె వెంటనే స్పందించి చింతపల్లి మండలానికి సుమారు 15 బోర్లు మంజూరు చేశారన్నారు. ఇవి పూర్తయితే మండలంలో మంచినీటి ఎద్దడి కొంతైనా తీరుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా కన్వీనర్ పాంగి గణబాబు, వైస్ సర్పంచ్ లకే సత్యనారాయణ, మాజీ వైస్ సర్పంచు రామకృష్ణ, వార్డ్ సభ్యులు చల్లంగి మరియమ్మ, చిలకమ్మా, గ్రామస్తులు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి

అదనపు ఎగ్జిక్యూటివ్ అధికారికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కిదారి

పాడేరులో టిటిడి బ్రాంచి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఏజెన్సీలో తిరుమల తిరుపతి దేవస్థానం శాఖను ఏర్పాటు చేయాలని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ తిరుపతి అదనపు ఎగ్జిక్యూటివ్ అధికారిని కోరారు. శుక్రవారం ఆయన తిరుమల తిరుపతి దేవస్థానం వెళ్లి వెంకటేశ్వరుని ఆశీర్వాదం తీసుకొన్నారు. అంతకముందు దేవస్థాన అదనపు ఈ.ఓ వెంకయ్య చౌదరి తో కలిసి అరకు కాఫీ ప్రమోట్ చేసే విదంగా సహకరించాలని జీసీసీ కాఫీ తో పాటు జీసీసీ స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా జీసీసీ చైర్మన్ శ్రావణ్ కుమార్ వెంట టీడీపీ రాష్ట్ర ఎస్ టీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ సాగర సుభారావు బాకూరు సర్పంచ్ వెంకటరమణారాజు దారేల సర్పంచ్ పాంగి పాండురంగస్వామి అనిల్ ఎస్ వి శ్రీనివాస్ చౌదరి నాగ భూషణ్ ఐసిసి క్రికెట్ కోచ్ మోహన్ సుందర్ తదితరులు ఉన్నారు.

మీ కోసంకు 94 అర్జీలు

వినతులు స్వీకరిస్తున్న జెసి, ఐటిడిఎ పిఒ తదితరులు

ప్రజాశక్తి-పాడేరు: సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 94 అర్జీలు అందాయి. జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ్, ఐటిడిఏ పిఒ వి.అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డి.ఆర్ఓ పద్మలత వివిద మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీ పత్రాలను సంబంధిత శాఖాధిపతులకు అందించి సమస్యలు పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాగు నీటి సమస్యలు, రహదారులు, అటవీ హక్కు పత్రాలు మంజూరు ఉపాధి అవకాశాలు, గృహ నిర్మాణాలు, నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు బిల్లులు తదితర సమస్యలపై అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఇఇ టి.కొండయ్య పడాల్, గిరిజన సంక్షేమ శాఖ ఇ ఇలు జి.డేవిడ్ రాజు, కె.వేణుగోపాల్, రహదారులు భవనాల శాఖ ఇఇ బాల సుందర బాబు, డిపిఓ బి. లవరాజు, ఐటిడిఏ పరిపాలనాధికారి ఎం.హేమ లత, డివిజనల్ పంచాయతీ అధికారి పి. ఎస్.కుమార్, సిపిఓ, ఎస్.ఎస్. ఆర్.కె. పట్నాయక్, పశు సంవర్ధక శాఖ డి.డి. నరసింహులు, ఎస్.ఎం.ఐ డిఇ. నాగేశ్వరరావు, ఎల్.డి.ఎం. మాతు నాయుడు, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ.రమేష్ కుమార్ రావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న పిఒ సింహాచలం

సమయపాలన పాటించకుంటే చర్యలు

ప్రజాశక్తి-దేవీపట్నం: ఏజెన్సీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు సకాలంలో విధులకు హాజరుకావాలని, లేకుంటే శాఖపరమైన చర్యలు తప్పవని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం హెచ్చరించారు. శుక్రవారం దేవీపట్నం మండలం వెలగపల్లి గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు. ఆసుపత్రిలో ఉన్న వైద్యాధికారులు, సిబ్బంది వివరాలపై ప్రశ్నించారు. వైద్యాధికారి విధులకు సకాలంలో హాజరు కాలేనందున ముందుగా నోటీసు జారీ చేయాలని రంపచోడవరం ఎడిఎంహెచ్‌ఒను పిఒ ఆదేశించారు. ఏజెన్సీలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యాధికారులు, సిబ్బంది సక్రమంగా విధులను నిర్వహించి, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.

శిక్షణ ధ్రువీకరణ పత్రాలను చూపుతున్న గిరి మహిళలు

కుట్టు మిషన్లు ఇవ్వకుండా మోసం

ప్రజాశక్తి -సీలేరు: గిరిజన మహిళలకు కుట్టుశిక్షణ ఇచ్చి, వారికి ఉచితంగా మిషన్లు పంపిణీ చేస్తామనియువ ప్రగతి సంస్థ ఒక్కో మహిళ నుంచి రూ.మూడు వేలు వసూలు చేసి కుట్టు మిషన్లు ఇవ్వకుండా మోసం చేసిందని ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు బాకూరి. కోటేశ్వరరావు ఆరోపించారు. మండలంలోని దారకొండ, దుప్పిలివాడ, గుమ్మరేవులు పంచాయతీల్లో 95 మంది మహిళలకు 2020లో మూడునెలలపాటు శిక్షణనిచ్చారన్నారు. అప్పట్లోనే కుట్టుమిషన్లు ఇస్తామని ఒక్కో మహిళ నుంచి డబ్బులు వసూలు చేసి, నాలుగేళ్లవుతున్నా నేటికీ మిషన్లు ఇవ్వలేదన్నారు. దీనిపై సంస్థ ప్రతినిధులను అడిగితే ఇదిగో, అదిగో అంటూ వాయిదాలు వేస్తూ వస్తున్నారని మహిళలు ఆవేదన చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రగతి సంస్థ స్పందించి, గిరిజన మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు వి. దామోదరం శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.

హెచ్‌పివి వ్యాక్సిన్‌తో కేన్సర్‌ను తరిమికొట్టగలం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : హెచ్‌పివి వ్యాక్సిన్‌తో మహిళల్లో గర్భాశయ ముఖద్వార కేన్సర్ మహమ్మారిని తరిమికొట్టగలమని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అన్నారు. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖపట్నం జిల్లా యూనిట్ సంయుక్తంగా కోటవీధి సమీపంలోని ఫిషర్‌మెన్ కమ్యూనిటీ హాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన కేన్సర్ నియంత్రణ హెచ్‌పివి వ్యాక్సిన్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.

ఉపాధి అవకాశాలు, సంపద సృష్టే లక్ష్యం

నాలెడ్జ్ ఎకానమీ భవిష్యత్తు నగరంగా విశాఖ

'డీప్ టెక్ ఇన్నోవేషన్ సమ్మిట్'లో సిఎం చంద్రబాబు

సమ్మిట్‌లో మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : ఉపాధి అవకాశాలు, సంపద సృష్టే తమ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. విశాఖలోని నోవొటల్ హోటల్‌లో శుక్రవారం గ్లోబల్ ఫోరం ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన 'నేషనల్ కాంక్లేవ్ ఆన్ డీప్ టెక్ ఇన్నోవేషన్ సమ్మిట్-2024'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'షేపింగ్ ది నెక్స్ట్ ఎరా ఆఫ్ గవర్నర్స్' అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ అనేది ఒక విప్లవంలాంటిదని అభివర్ణించారు. ఎపిలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాన్ని తన హయాంలో అభివృద్ధి చేశామన్నారు. నాలెడ్జ్ ఎకానమీ భవిష్యత్ నగరంగా వైజాగ్ నిలుస్తోందని కితాబిచ్చారు. సోలార్, విండ్, పంప్డ్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నామని సిఎం తెలిపారు. వైజాగ్‌లో గ్రీన్ హైడ్రోజన్ ఎనర్జీ ప్రాజెక్టులో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఎన్‌టిపిసి-ఎపిజెన్‌కో మధ్య ఒప్పందం జరిగిందన్నారు.

డీప్ టెక్నాలజీతో ప్రజా ఆరోగ్య రంగంలో విశేష మార్పులు

డీప్ టెక్నాలజీ సాధనాలు వైద్య సేవల రూపురేఖలను సమూలంగా మారుస్తాయని, పేద ప్రజల జీవితాలలో వెలుగులు తీసుకొస్తాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. డీప్ టెక్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ కొత్త సాంకేతిక పరిష్కారాలతో ప్రజలందరికీ సమానమైన ఆరోగ్య సంరక్షణ సేవలు అందుబాటులో వస్తాయన్నారు. ఒక వ్యక్తి ఆరోగ్యం ఆ కుటుంబానికి, రాష్ట్రానికి, దేశానికి చాలా కీలకమని చెప్పారు. 2047 నాటికి వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాలను చేరుకోవడానికి కొత్త ఆరోగ్య మిషన్‌ను స్వీకరించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ప్రజల ఆర్థిక స్థోమతకు తగిన ఆరోగ్య సంరక్షణ సేవలు అందుబాటులోకి రావాలన్న మంత్రి తద్వారా వ్యక్తులు ఆరోగ్యవంతులుగా మారతారని చెప్పారు. వారి వల్ల సంపద సృష్టి సాధ్యమవుతుందన్నారు. ఆరోగ్య సేవల విషయంలో రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా ఇప్పటికీ అనేక సవాళ్లు ఉన్నాయని వెల్లడించారు. డీప్ టెక్నాలజీ స్వీకరణకు ఎపి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజలకు వచ్చిన వ్యాధులు, వాటి తీరుకు సంబంధించి ప్రస్తుతం సమగ్ర సమాచారం అందుబాటులో ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రతిభావంతులైన యువతకు కొదువ లేదన్నారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించడానికి, తద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్ కలను సాకారం చేసుకునేందుకు ఒక స్పష్టమైన పాలసీని రూపొందించేందుకు ఒక కమిటీని నియమించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు సత్యకుమార్ విజ్ఞప్తి చేశారు. దీనివల్ల మరింతమంది యువ ఆవిష్కర్తలు ముందుకు వస్తారన్నారు. సదస్సులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, సీనియర్ ఐఎఎస్ అధికారి కృష్ణబాబు, మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హైటెక్ బాబు.. అవే మాటల డాబు

ఆహార ధాన్యాల కంటే మొబైల్ టెక్నాలజీ గొప్పదంటూ సమర్థన

ఎక్కడా కానరాని మాన్యుఫ్యాక్చర్ రంగం ప్రస్తావన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : చంద్రబాబా మజాకా... మరోసారి హై 'టెక్' బాబు అనిపించుకున్నారు. పొద్దున లేచిన్నుంచీ పొద్దుపోయేదాకా 'డీప్'గా టెక్నాలజీనే ప్రతి ఒక్కరూ వాడెయ్యాలంటూ ఆయన శుక్రవారం జరిగిన సమ్మిట్‌లో పదేపదే తనదైన పాత పంథాలోనే మాటలను వల్లెవేశారు. సాంకేతికతను నమ్ముకుంటే ఉపాధి దొరుకుతుందంటూ సలహా మాత్రం ఇచ్చారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలపై నిర్దిష్టమైన పత్రాలేవీ సదస్సులో వెల్లడించలేదు. అందుకు సంబంధించిన ఒప్పందాలేవీ జరగలేదు. ముఖ్యంగా వస్తు సేవల ఉత్పత్తి (మాన్యుఫ్యాక్చర్ సెక్టార్) ప్రస్తావన చేయకపోవడం గమనార్హం. దీనిపై ఒప్పందాలు సైతం జరగలేదు. 1998-2000 మధ్య కాలంలో విద్యుత్ రంగంలో ఆయన ప్రారంభించిన సంస్కరణలను విశాఖలో మరోసారి ఆయన సమర్థించుకున్నారు. అప్పట్లో పిపిపి ఒప్పందాలు, ఆ సంస్కరణల కారణంగా ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణల వ్యతిరేక ఉద్యమాలు జరిగిన సంగతి ప్రజలు ఎప్పటికీ మరచిపోరు. ఎందుకంటే ఆ ఉద్యమంలో ప్రభుత్వ తుపాకీ గుళ్లకు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. సంస్కరణల ఘనత తమ టిడిపి ప్రభుత్వానిదేనంటూ బాబు తనకు తానే కితాబిచ్చుకున్నారు. హైటెక్ సిటీ, హైటెక్ టవర్ల గురించే ప్రజల్లో ఇప్పటికీ చర్చ జరుగుతోందని, ఎవ్వరూ మాట్లాడని సమయంలో గతంలోనే తాను టెక్నాలజీపై మాట్లాడానని డాంబికాలు పోయారు. దేశ జిడిపి 8 శాతం ఉంటే రాష్ట్ర జిడిపి 8.7 శాతం ఉండడానికి తామే కారణమని చెప్పుకొచ్చారు. మొబైల్ ఫోన్‌ల గురించి తాను మాట్లాడినప్పుడు ఆహారధాన్యాల అవసరాల కంటే ఫోన్‌లు గొప్పవా అంటూ తనను గతంలో ప్రశ్నించిన వారే మొబైల్స్ చుట్టూ తిరుగుతున్నారంటూ విమర్శలు గుప్పించారు.

పేదలను దత్తత తీసుకుంటే పేదరికం పోతుందా ?

అధిక సంపద కలిగిన వారు పేదలను దత్తత తీసుకుంటే వారు కూడా ఉన్నత స్థాయిలోకి వస్తారని, తద్వారా పేదరికాన్ని రూపుమాపి ఆర్థిక అసమానతలను తగ్గించేందుకు కృషి చేయాలని, ప్రభుత్వం అందుకు కట్టుబడి ఉందని చంద్రబాబు సదస్సులో చెప్పడం అందరికీ విడ్డూరంగా అనిపించింది. పేదరిక నిర్మూలనకు నిర్దిష్టమైన విధానం ప్రభుత్వం వద్ద లేదన్నది దీంతో స్పష్టమైంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా ఉన్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అంశంపై చంద్రబాబు నోరుమెదపకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -సీలేరు: ఉపాధి హామీ నిధులతో వంచల గ్రామానికి సిసి రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం సర్పంచి వి.కాసులమ్మ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రూ.3లక్షలతో 75 మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బి కుమారి, ఎంపిటిసి సరస్వతి , పంచాయతీరాజ్ జెఇ జ్యోతిబాబు, వార్డు సభ్యులు పి. సోములమ్మ, కె. రఘునాథ్ సచివాలయం సిబ్బంది వైసిపి నేతలు ఎ.సత్తిబాబు, ఎల్. గణపతి, వి. రాజేష్, జానకిరామ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

కేన్సర్‌తో గిరిజన బాలిక మృతి

- వైద్యానికి ఉన్నదంతా ఖర్చుచేసి చితికిపోయిన బాధితులు

- ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి -ఎటపాక :మండలంలోని నల్లకుంట పంచాయతీ రాఘవపురం గ్రామానికి చెందిన గిరిజన బాలిక పొడియం మనీషా (16) రెండేళ్లుగా కేన్సర్‌తో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందింది. మనీషా చింతూరు మండలం బొడ్డుగూడెం ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకుంది. 10వ తరగతి చదువుతున్న సమయంలోనే కేన్సర్ సోకిందని నిర్ధారణ అయింది. దీంతో హైదరాబాద్ బసవతారకం కేన్సర్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స తీసుకుంది. అనారోగ్యంతో గతేడాది టెన్త్ పరీక్షలు రాయలేకపోయి దినసరి వ్యవసాయ కూలీలైన మనీషా తల్లిదండ్రులు, ఆమెకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం తీసుకున్నప్పటికీ, పదేపదే హైదరాబాద్ వెళ్లి రావడానికి, అక్కడి ఉండేందుకు ఆర్థిక సహాయం కోసం పలుమార్లు ఐటిడిఎను ఆశ్రయించారు. దీని బాధ్యత చూడాలని పిఒ ఎడిఎంహెచ్‌ఒ డాక్టర్ పుల్లయ్యకు సూచించారని మనీషా తండ్రి శ్రీను తెలిపారు. కానీ డాక్టర్ పుల్లయ్యను పలుమార్లు కలిసినా ఫలితం లేకుండా పోయిందని, డాక్టర్ పుల్లయ్య నిర్లక్ష్యం కారణంగానే తమకు ఎటువంటి సాయం అందలేదన్నారు. హాస్టల్లో హెచ్‌ఎం, వార్డెన్ కూడా బాలిక కేన్సర్ పరిస్థితిని అధికారులకు తెలియజేయకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. తమ బిడ్డ వైద్యానికి ఉన్నదంతా ఖర్చుచేసి, ఇపుడు జీవనానికి ఇబ్బందులు పడే స్థితికి చేరుకున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్య వీడి బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా సాయం అందించి న్యాయం చేయాలనిఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పిఒ సూచించినా, సాయం చేయడంలో నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి- చింతూరు : మండలంలోని ఏడుగురాళ్లపల్లి చుట్టుపక్క గ్రామాల్లో అల్లూరి ఆదివాసి యువజన సంఘం, గిరిజన అభ్యుదయ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు అంటించి, ర్యాలీ నిర్వహించారు. ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకు మావోయిస్టులు పిఎల్‌జిఎ వారోత్సవాలను జరుపుకుంటున్న నేపథ్యంలో వారికి వ్యతిరేకంగా ఆందోళన చేశారు. గిరిజనులకు ఉపయోగపడని మావోయిస్టుల వారోత్సవాలు వద్దని, అమాయక గిరిజనులను ఇన్ఫార్మర్ నెపంతో చంపడం, బస్సుల దగ్ధం, రోడ్డు పనులు చేసే యంతసామగ్రిని కాల్చేయడం వంటి వినాశకర చర్యల వల్ల గిరిజనులకు నష్టమే తప్ప ఒరిగిందేమీ లేదని నినాదాలు చేశారు. వారోత్సవాల పేరుతో గిరిజనులనుఉచ్చులోనికి లాగొద్దని, స్థూపాలు కట్టి, వారి పాపాల్లో తమకు పాలు పంచవదుని నినాదాలు చేశారు ఏడుగురాళ్లపల్లి శుక్రవారం సంతలో కూడా స్థానిక గిరిజనులు మావోయిస్టు వారోత్సవాలను వ్యతిరేకిస్తూ ర్యాలీ చేశారు.

మంత్రి నాదెండ్ల మనోహర్‌తో విక్రమ్ భేటీ


మంత్రి మనోహర్‌తో విక్రమ్, తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి, జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్‌తో శుక్రవారం ఉదయం విశాఖలో జనసేన విజయనగరం జిల్లా నాయకులు అవనాపు విక్రమ్ భేటీ అయ్యారు. జిల్లాలో జనసేన పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ పాత్ర తదితర అంశాలపై వారి మధ్య చర్చ సాగింది. విక్రమ్‌తో పాటు మనోహర్‌ను కలిసిన వారిలో సాలూరు మాజీ మున్సిపల్ చైర్మన్, జనసేన నాయకులు జరజాపు ఈశ్వరరావు, నాయకులు జరజాపు సూరిబాబు ఉన్నారు.